భూ సమస్యల పరిష్కారానికే 'భూ భారతి'

- హాలియా, తిరుమలగిరి(సాగర్)లలో భూ భారతి చట్టం పై అవగాహన సదస్సు
- పాల్గొన్న కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎమ్మెల్యే జయవీర్‌రెడ్డి


తిరుమలగిరి(సాగర్) : మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి, చిత్రంలో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ


హాలియా : కొత్తపల్లిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జయవీర్‌రెడ్డి, చిత్రంలో కలెక్టర్, ఎమ్మెల్సీ

హాలియా : రైతులు ఎదుర్కొంటున్న భూ సంబంధిత సమస్య పరిష్కారానికి సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో నూతన భూ భారతి చట్టం తీసుకొచ్చినట్లు సాగర్ ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు. శనివారం అనుముల మండలంలోని కొత్తపల్లి రైతు వేదికలో భూ భారతి చట్టంపై మండలస్థాయి రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే జయవీర్‌రెడ్డి, ఎమ్మెల్సీ శంకర్‌నాయక్, కలెక్టర్ ఇలా త్రిపాఠి, సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్ హాజరయ్యారు. తెలంగాణ ప్రభుత్వం ముద్రించిన భూ భారతి చట్టానికి సంబంధించిన కరపత్రాన్ని రైతులకు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి, కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడారు. భూ భారతి ద్వారా 30 రోజుల్లో మ్యుటేషన్ చేయకపోతే 31వ రోజు ఆటోమెటిక్‌గా మ్యుటేషన్ జరుగుతుందన్నారు. ఎమ్మెల్సీ శంకర్‌నాయక్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానాల మేరకు ధరణి స్థానంలో భూ భారతి చట్టం తీసుకువచ్చిందన్నారు. ఈ కార్యక్రమం లో మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ కర్నాటి లింగారెడ్డి, హాలియా మార్కెట్ చైర్మన్ తుమ్మలపల్లి చంద్రశేఖర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కుందూరు వెంకట్ రెడ్డి, మండల ప్రత్యేక అధికారి, జిల్లా విద్యాధికారి బిక్షపతి, ఎంపీడీఓ సుజాత తదితరులు ఉన్నారు.

అమృత్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలి

హాలియా మున్సిపాలిటీ పరిధిలో చేపట్టిన అమృత్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను, కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. శనివారం ఆమె సాగర్ ఎమ్మెల్యే జయవీర్ రెడ్డితో కలిసి హాలియా మున్సిపల్ కార్యాలయంలో అమృత్ పథకం కింద చేపట్టిన తాగునీటి పనులపై ఇంజనీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్‌తో సమీక్ష నిర్వహించారు. జిల్లాలోని ఇతర మున్సిపాలిటీలతో పోలిస్తే హాలియా మున్సిపాలిటీలో చేపట్టిన అమృత్ పనుల పురోగతి ఆశించినంతగా లేదని అందుకు కారణమైన కాంట్రాక్టర్‌కు నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. ఎమ్మెల్యే జయవీర్‌రెడ్డి మాట్లాడుతూ అమృత్ నిబంధనల ప్రకారం పనులు పూర్తి చేయాల్సిన బాధత కాంట్రాక్టర్‌పై ఉందన్నారు. ఒప్పందం ప్రకారం పనులు పూర్తి చేయనందుకుగాను కాంట్రాక్టర్‌కు నోటీసులు ఇవ్వాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో పబ్లిక్ హెల్త్ ఎస్‌ఈ వెంకటేశ్వర్లు, ఈఈ సత్యనారాయణ, డీఈ మనోహర, ఏఈ సురేష్, కమిషనర్ రామదుర్గారెడ్డి, సబ్ కాంట్రాక్టర్ సతీష్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

భూ భారతి చట్టం అమలులో తిరుమలగిరికి గుర్తింపు

తిరుమలగిరి(నాగార్జునసాగర్): రాష్ట్ర ప్రభుత్వం రైతుల భూ సమస్యలు పరిష్కరించేందుకు నూతనంగా తీసుకువచ్చిన భూ భారతి చట్టం అమలులో తిరుమలగిరి మండలానికి ప్రత్యేక గుర్తింపు దక్కిందని, ఇక్కడ ఎదుర్కొన్న అనేక భూ సమస్యలు పరిష్కరించేందుకు ప్రత్యేకంగా పరిశీలించి చట్టం అమలులో కీలకమైందని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. భూభారతి అమలులో భాగంగా ఏర్పాటు చేసిన మండల స్థాయి అవగాహన సదస్సులో స్థానిక ఎమ్మెల్యే కుందూరు జయవీర్‌రెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మండలంలో మండలంలో అన్ని రకాల భూ సమస్యలు ఉన్నాయని సుమారు మూడు వేల ఎకరాల ఈపీ భూములు, ఐదు వేల ఎకరాల ఆర్‌ఓఎఫ్ఆర్, రెండు వేల ఎకరాల డీఫారెస్ట్ భూములకు సంబందించి పట్టాలు ఇవ్వాల్సి ఉందన్నారు. ఈపీ ల్యాండ్స్‌కు సంబంధించి సుప్రీంకోర్టు పరిశీలనలో ఉందని తెలిపారు. రైతులు ప్రభుత్వ భూములను, గతంలో ఇచ్చిన భూములను ఎట్టి పరిస్థితుల్లో అమ్మడం లేదా కొనే సాహసం చేయవద్దని ఒకవేళ ఆవిధంగా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రెండు వేల ఎకరాల డీ ఫాం పట్టా ఉందని, అటవీ అధికారులతో సమన్వయం చేసుకుని త్వరలోనే ఈ సమస్యను సైతం పరిష్కరించి రైతుల శాశ్వత పరిష్కారం కోసం కృషి చేస్తామన్నారు. అలాగే ఐదు వేల ఎకరాల ఆర్వో ఎఫ్ఆర్ భూములు ఉన్నాయని, రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ కమిషనర్‌కు లేఖ రాసి ఎఫ్ఆర్‌సీ కమిటీని ఏర్పాటు చేస్తామన్నారు. ఎమ్మెల్యే జయవీర్‌రెడ్డి మాట్లాడుతూ మండలంలో సుమారు పది నెలలుగా ఇక్కడ భూ సమస్యల పరిష్కారానికి సర్వే నిర్వహించడంలో రెవెన్యూ యంత్రాంగం అహర్నిశలు కృషి చేసిందని తెలిపారు. మండలంలో అనేక వింతైన భూసమస్యలు ఉన్నందునే రాష్ట్ర ప్రభుత్వం తిరుమలగిరి సాగర్ మండలాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసిందని తెలిపారు. సర్వే ఇంకా కొనసాగుతున్నప్పటికీ కొద్ది మొత్తంలో సమస్యలు ఉన్నాయని, వాటికి త్వరలోనే పరిష్కారం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ శంకర్‌నాయక్, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్, జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ కర్నాటి లింగారెడ్డి, ఏఎంసీ చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి, వైస్ చైర్మన్ కాంసాని చంద్రశేఖర్, నాయకులు గడ్డం సాగర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, తహసీల్దార్ అనిల్, ఎంపీడీఓ మల్లిశ్వర్ పాల్గొన్నారు.

వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి


మందులు అందజేస్తున్న ఎస్పీ శరత్ చంద్ర పవార్, ఎమ్మెల్యే బాలునాయక్

చందంపేట : గ్రామీణ ప్రాంత ప్రజలు ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ శరత్ చంద్ర పవార్, దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్ అన్నారు. శనివారం చందంపేట మండలంలోని పోలేపల్లి గ్రామంలో పోలీసు శాఖ వారి ఆధ్వర్యంలో నార్కట్‌పల్లి కామినేని, జీజీఎం ఆస్పత్రి సౌజన్యంతో నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరంలో సుమారు 1500 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. సుమారు రూ.60వేల విలువైన మందులను ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ, ఎమ్మెల్యే మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ మౌనిక, రూరల్ సీఐ సురేష్, చందంపేట ఎస్ఐ సతీష్, నాయకులు సిరాజ్‌ఖాన్, శ్రీశైలంయాదవ్, బద్యానాయక్, కృష్ణయ్య, బస్వారెడ్డి, మల్లారెడ్డి, హరికృష్ణ, పాల్గొన్నారు.

క్రీస్తు త్యాగం మహోన్నతమైనది


దేవరకొండ : ర్యాలీ ప్రారంభించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలునాయక్


కొండమల్లేపల్లి : ర్యాలీలో పాల్గొన్న క్రైస్తవులు

దేవరకొండ : క్రీస్తు త్యాగం మహోన్నతమైనదని దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్ అన్నారు. గుడ్ ఫ్రైడే,ఈస్టర్ పండుగలను పురస్కరించుకొని శనివారం దేవరకొండ పట్టణంలో క్రైస్తవులు రన్ ఫర్ జీసస్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ర్యాలీని దేవరకొండ ఎమ్మెల్యే జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ర్యాలీలో పాల్గొని ఆయన మాట్లాడారు.ఈ కార్యక్రమంలో సిరాజ్‌ఖాన్, ఆలంపల్లి నర్సింహ, ముక్కమళ్ల వెంకటయ్య, సురేష్‌గౌడ్, డానియల్, జాన్, వేణు, ప్రసాద్, టైటస్, ఐజాక్, పురుషోత్తం, క్రిస్టఫర్, ప్రసన్నకుమార్, ఆదాం, ప్రశాంత్, జాన్సన్ ,క్రైస్తవులు, తదితరులు పాల్గొన్నారు.

కొండమల్లేపల్లి : మండల కేంద్రంలో శనివారం రన్ ఫర్ జీసస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాస్టర్లు, క్రైస్తవులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు పాస్టర్లు మాట్లాడుతూ యేసు క్రీస్తు చూపిన ప్రేమ, కరుణ, శాంతి మార్గం ఆచరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పాస్టర్లు, క్రైస్తవ సోదరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి


అవగాహన సదస్సులో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి

దేవరకొండ : భారత రాజ్యాంగంలో పొందుపర్చబడిన చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని మండల న్యాయ సేవాసంస్థ చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి కె.అనిత అన్నారు. శనివారం దేవరకొండ కోర్టులో మండల న్యాయ సేవాసంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. హిజ్రాలకు ఏర్పాటు చేసిన రక్షణ చట్టంపై అవగాహన కల్పించారు. హిజ్రాలను అందరితో సమానంగా గౌరవించాలని ఆమె పేర్కొన్నారు. వారిపై ఎలాంటి వివక్ష చూపకూడదని తెలిపారు. ఈ సదస్సులో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి పి.రవీందర్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఉమామహేష్, న్యాయవాదులు గాజుల ఆంజనేయులు, శ్రీనివాస్‌రెడ్డి, పుష్పలత, షౌకత్ అలీ, రాములు, జగదీశ్వర్, అశోక్, శ్రీకాంత్, రవికుమార్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల ఆత్మీయ సమ్మేళనం


ఎంఈఓ రాములను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

పెద్దవూర : మండలంలోని వెల్మగూడెం స్కూల్ కాంప్లెక్స్ పరిధిలోని ఉపాధ్యాయులు శనివారం మండల కేంద్రంలోని విద్యా వనరుల కేంద్రంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ విద్యా సంవత్సరంలో నిర్వహించిన కార్యక్రమాలు, అనుభవాలను ఒకరికొకరు పంచుకున్నారు. వచ్చే విద్యా సంవత్సరంలో విద్యార్థుల సంఖ్యను పెంచుకుని నాణ్యమైన విద్యను అందించాలని, ప్రతి ఉపాధ్యాయుడు ఆంగ్లంలో మాట్లాడుతూ కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలలో ఆంగ్లం మాట్లాడేలా తయారు చేస్తామని, విద్యార్థులు ఉన్నత ప్రమాణాలు సాధించేలా కృషి చేస్తామని నిర్ణయించుకున్నారు. అనంతరం ఎంఈఓ తరి రాములు, స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎం శ్రీనివాస్‌లను శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రేపాల అశోక్, రామాంజిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, హిమవంతరెడ్డి, వసంతకుమార్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య


చింతపల్లి : హోమంతాలపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న ఎంఈఓ, ఉపాధ్యాయులు

చింతపల్లి: గ్రామీణ ప్రాంత విద్యార్థులకు మంచి క్రమశిక్షణతో కూడిన నాణ్యమైన విద్య ప్రభుత్వ పాఠశాలల్లోనే అందుతుందని ఎంఈఓ నీరుడు అంజయ్య అన్నారు. మండల పరిధిలోని హోమంతలపల్లి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దూపాటి రమేష్ ఆధ్వర్యంలో శనివారం ముందస్తు 'బడి బాట' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మండల విద్యాశాఖధికారి నీరుడు అంజయ్య, చింతపల్లి కాంప్లెక్స్ హెడ్మాస్టర్ రామావత్ లక్ష్మి హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు జగ్రామ్, మల్లేశం, వెంకటయ్య, ఉషారాణి, నాగరాజు, జయశ్రీ, పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం కావాలి

నిడమనూరు : బడిబాటతో ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం కావాలని మండల విద్యాధికారి ఎల్ వెంకన్న సూచించారు. నిడమనూరు ప్రాథమిక పాఠశాల పరిధిలో బడిబాటను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా బడిబాటతో విద్యార్థుల సంఖ్య పెరిగేలా చూడలన్నారు. ఈఅ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు గౌతమ్, ఉపాధ్యాయులు కర్నాటి శీనుకుమార్, పీడీ లచ్చయ్య, వెంకన్న, జలంధర్, కే విజయలక్ష్మి, ఝాన్సీ, పూర్ణిమా, కోడి స్వాతి తదితరులు ఉన్నారు.

మిర్యాలగూడ : ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని ఎంఈఓ బాలాజీనాయక్ అన్నారు. శనివారం దామరచర్ల మండలం కల్లెపల్లి ప్రాథమిక, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులు ముందస్తు బడిబాట కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీనివాస్‌రావు, శ్రీదేవి, గురువారెడ్డి, పాషా, కవిత, నారాయణ, భారతి ఉన్నారు.

త్రిపురారం : ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు మెరుగైన విద్య అందుతుందని త్రిపురారం ఎంఈఓ రమావత్ రవి అన్నారు. శనివారం మండలంలోని పెద్ద దేవుల పల్లి గ్రామంలో ప్రభుత్వ ఉపాధ్యాయులు ముందస్తు బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న వసతులపై తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

గుర్రంపోడు : ముందస్తు బడిబాట కార్యక్రమంలో భాగంగా శనివారం మండలంలోని చామలేడు, నడికూడ గ్రామాల్లో కరపత్రాలతో ప్రచారం, ర్యాలీలు నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్‌లు, ఏకరూప దుస్తులు, మధ్యాహ్న భోజనం తదితర సౌకర్యాలన్నీ కల్పించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్ఎంలు కాలం నారాయణరెడ్డి, క్షేత్రయ్య, మారం జగదీశ్వర్‌రెడ్డి, మారం వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ కవర్లు, చెత్తా చెదారం తొలగింపు


ప్లాస్టిక్ కవర్లు, చెత్తా చెదారం తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

దేవరకొండ : దేవరకొండ మున్సిపాలిటీ పరిధిలో విచ్చలవిడిగా ప్లాస్టిక్ వినియోగంపై శనివారం 'సాక్షి' దినపత్రికలో ప్లాస్టిక్ నిషేధం..ఉత్తర్వులకే పరిమితం అన్న శీర్షికన ప్రచురితమైన కథనానికి దేవరకొండ మున్సిపల్ అధికారులు స్పందించారు. పట్టణంలోని గాంధీనగర్‌తో పాటు పలు కాలనీల్లో ఓపెన్ ప్లాట్లలో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలతో పాటు డ్రెయినేజీల్లో కూరుకుపోయిన ప్లాస్టిక్ వస్తువులను మున్సిపాలిటీ శానిటరీ ఇన్‌స్పెక్టర్ సురిగి శంకర్ ఆధ్వర్యంలో మున్సిపల్ సిబ్బంది తొలగించారు. దాదాపు రెండు గంటలకు పైగా శ్రమించి సిబ్బంది చెత్తా చెదారాన్ని తరలించారు. ఈ సందర్భంగా సురిగి శంకర్ మాట్లాడుతూ ప్రతి రోజూ కాలనీలకు వచ్చే చెత్త సేకరణ ఆటోలకు మాత్రమే తడి, పొడి చెత్తను వేరు చేసి అందించాలన్నారు. ఎవరైనా ప్లాస్టిక్ కవర్లను వినియోగించినా బహిరంగ ప్రదేశాల్లో చెత్తను పడవేసినా జరిమానా విధిస్తామని హెచ్చరించారు.

నేటి నుంచి ఓపెన్ స్కూల్ సొసైటీ పరీక్షలు

మిర్యాలగూడ : ఓపెన్ స్కూల్ సొసైటీ పరీక్షలు ఆదివారం నుంచి ప్రారంభం కానున్నాయి. వివిధ కారణాలతో చదువును మధ్యలో ఆపేసిన వారికి, తక్కువ విద్య అర్హతలతో ప్రభుత్వ ఉద్యోగాలు చేస్తూ ప్రమోషన్ల కోసం ఉన్న వారి కోసం ప్రభుత్వం ప్రారంభించిన ఓపెన్ స్కూల్ పరీక్షలు ఈనెల 20 నుంచి 30 వరకు జరగనున్నాయి. మిర్యాలగూడలో నాలుగు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఎంఈఓ బాలు తెలిపారు. పట్టణంలోని బకల్‌వాడీ ప్రభుత్వ పాఠశాల, ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల, సెయింట్‌మేరీ పాఠశాలతోపాటు ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఈ పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. పదో తరగతి పరీక్షలు సెయింట్‌మేరీ పాఠశాలతోపాటు ప్రభుత్వ బాలికల పాఠశాలలో నిర్వహించనుండగా బకల్‌వాడి ప్రభుత్వ బాలుర పాఠశాలలో ఇంటర్ పరీక్షలు జరగనున్నాయి. ప్రతి సెంటర్‌లో 250మందికి పైగా విద్యార్థులు హాజరు కానున్నట్లు తెలిపారు. పరీక్షల్లో ఎటువంటి అవకతవకలు జరగకుండా అధికారులు అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

విద్యార్థులకు సేంద్రియ వ్యవసాయంపై అవగాహన

త్రిపురారం : నిడమనూరు మండల కేంద్రంలోని టీజీ మోడల్ స్కూల్ విద్యార్థులు త్రిపురారం మండలంలోని కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే)ను శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా కేవీకే కంపాసాగర్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీనివాస రావు కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు రైతులకు అందిస్తున్న సేవలపై వివరించారు. నూతన వ్యవసాయ పద్ధతులు, వ్యవసాయంలో యాంత్రీకరణ వినియోగం సాంకేతిక పరిజ్ఞానం వల్ల కలిగే ప్రయోజనాలు, వర్మీకంపోస్టు, ప్రకృతి, సేంద్రియ వ్యవసాయం, వాతావరణ కాలుష్యం తగ్గించుకునే పద్ధతులు, పెరటి తోటల పెంపకంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం క్షేత్ర స్థాయిలో వివిధ రకాల పంటల సాగులను విద్యార్థులకు చూపించి సాగు పెట్టుబడిపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కేవీకే సేద్యపు విభాగం శాస్త్రవేత్త చంద్ర శేఖర్, సస్యరక్షణ శాస్త్రవేత్త రాములమ్మ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నిందితుడిని కఠినంగా శిక్షించాలి


హాలియా : కలెక్టర్ ఇలా త్రిపాఠికి వినతి పత్రం అందజేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

హాలియా : మల్లేశ్వరీ ఆత్మహత్యకు కారణమైన నిందితుడిని కఠినంగా శిక్షించాలని కోరుతూ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో శనివారం హాలియాలో కలెక్టర్ ఇలా త్రిపాఠికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ రాష్ట్ర సీనియర్ నాయకులు ఆడేపు నాగార్జున మాట్లాడారు. మల్లేశ్వరీ చావుకు కారణమైన నిందితుడిన్ని కఠినంగా శిక్షించడంతో పాటు మల్లేశ్వరీ కుటుంబానికి తగిన న్యాయం చేయాలని వినతి పత్రంలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వినతి పత్రం అందించిన వారిలో ఎమ్మార్పీఎస్ అనుముల మండల అధ్యక్షుడు గార్లపాటి ప్రసాద్ మాదిగ, నాయకులు మల్లేపల్లి నరేందర్ మాదిగ, తరి పెద్ద నాగయ్య మాదిగ, ఊరే వెంకటయ్య మాదిగ, బూడిద విజయ్ మాదిగ ఉన్నారు.

మల్లేశ్వరీకి ఘన నివాళి..

మల్లేశ్వరీ కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ ధర్మ సమాజ్ పార్టీ అనుముల మండల అధ్యక్షుడు మామిడి రవి మహారాజ్ ఆధ్వర్యంలో హాలియా పట్టణంలో ఆ సంఘం నాయకులు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నల్లగొండ జిల్లా ధర్మ స్టూడెంట్ యూనియన్ కన్వీనర్ పెరిక సురేష్ మహారాజ్, మండల ప్రధాన కార్యదర్శి గోవర్ధన్, వంశీ, కోటేష్, మండల నాయకులు శివ శంకర్, రాజు, లక్ష్మణ్, శశి, ఆకాష్, సురేష్, శేఖర్, వినోద్, అనిల్ ఉన్నారు.

చింతపల్లి : నిడమనూరు మండలం బొక్కమంతల పహాడ్ గ్రామానికి చెందిన దళిత బిడ్డ మల్లీశ్వరి ఆత్మహత్యకు కారణమైన నిందితుడికి ఉరి శిక్ష విధించాలి మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సమదర్భంగా ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు కృష్ణ మాదిగా మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బావండ్లపల్లి చెన్నయ్య, ఎంఎస్ఎఫ్ నాయకులు శ్రీకాంత్ జాంబవ్, యాదయ్య, రాధాకృష్ణ, జగన్, కాశయ్య, పెద్దయ్య, కిరణ్, శ్రీను, పాల్గొన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం


మనిషికి తాకే ఎత్తులో వేలాడుతున్న విద్యుత్ తీగలు


పక్కకు ఒరిగిన విద్యుత్‌స్తంభం

కొండమల్లేపల్లి : మండల కేంద్రంలో స్థానిక హైదరాబాద్ రోడ్డులోని అంబేడ్కర్ కాలనీకి సమీపంలోని రోడ్డు పక్కన విద్యుత్ స్తంభం ఒక వైపుకు వంగి ఉండడంతో ఆ స్తంభానికి ఉన్న విద్యుత్ వైర్లు ప్రమాదకరంగా కిందికి జారి మనుషులకు తాకే విధంగా ఉన్నాయి. అంతేగాక చెట్ల మధ్య భాగం వరకు విద్యుత్ వైర్లు తాకుతుండడంతో వర్షాలు వచ్చినప్పుడు ఆ తడి వల్ల షాక్ తగులుతుంది. ఎప్పుడు ఆ స్తంభం కూలుతుందోనని భయభ్రాంతులకుగురవుతున్నారు. ఈ వైర్లను సరి చేయాలని అధికారులకు తెలిపినా పట్టించుకోవడం లేదని ఆరోపణలు ఉన్నాయి.

మిల్లర్లపై ఎమ్మెల్యేకు రైతుల ఫిర్యాదు


పెద్దవూర : ఎమ్మెల్యేతో మాట్లాడుతున్న రైతులు

పెద్దవూర : మండల కేంద్రంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో విక్రయించిన ధాన్యానికి తేమ, తాలు పేరుతో మిల్లర్లు ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఎమ్మెల్యే జయవీర్‌రెడ్డికి రైతులు ఫిర్యాదు చేశారు. శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన భూ భారతి చట్టంపై అవగాహన సదస్సుకు హాజరైన ఎమ్మెల్యే జయవీర్‌రెడ్డికి మండల రైతులు తమ సమస్యలను విన్నవించారు. కొనుగోలు కేంద్రంలో తేమశాతం కొలిచే ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నారన, మిల్లు వద్దకు వెళ్లిన తర్వాత మిల్లర్లు రైతులను ఇబ్బందులకు గురి చేస్తు క్వింటాలుకు నాలుగు నుంచి ఐదు కిలోల తరుగు తీస్తున్నారని వాపోయారు. దీంతో ఎమ్మెల్యే జయవీర్‌రెడ్డి అక్కడే ఉన్న పీఏసీఎస్ చైర్మన్ వెంకట్ రెడ్డిని, సిబ్బందిని, వ్యవసాయ అధికారి సందీప్‌కుమార్‌లను పిలిపించి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రశ్నించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలని, మిల్లర్లతో మాట్లాడి ఎందుకు తరుగు తీస్తున్నారో తెలుసుకుని మరోసారి ఇలాంటి సమస్యలు పునరావృతం కాకుండా చూడాలని ఆదేశించారు.

సంక్షిప్త సమాచారం

రోడ్డు ప్రమాదాలపై జాగ్రత్తగా ఉండాలి

చింతపల్లి : రోడ్డు ప్రమాదాలపై ప్రజలు జాగ్రత్తగా ఉండాలని చింతపల్లి ఎస్ఐ యాదయ్య అన్నారు. శనివారం మాల్ వెంకటేశ్వర్ నగర్‌లోని జయ గార్డెన్స్ లో వాహనదారులకు, నల్లగొండ జిల్లా జాగృతి పోలీస్ కళా బృందం తో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమం లో వివిధ గ్రామాల ప్రజలు, వాహనదారులు ,డ్రైవర్లు, పోలీస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

జేఈఈ మెయిన్స్‌లో ప్రతిభ

మిర్యాలగూడ : జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో పట్టణంలోని కేఎల్ఎన్ జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రతిభ చాటి ఉత్తమ ర్యాంకులు సాధించినట్లు కళాశాల కరస్పాండెంట్ కిరణ్‌కుమార్ శనివారం తెలిపారు. వివిధ కేటగిరీలో కె.అభిరామ్ 3861వ ర్యాంకు, పి.రంగా 3967వ ర్యాంకుతోపాటు పదివేల లోపు ర్యాంకులను ఐదుగురు, అడ్వాన్స్‌కు అర్హత సాధించిన వారు 15మంది విద్యార్థులు ఉన్నట్లు తెలిపారు. ర్యాంకులను సాధించిన విద్యార్థును కళాశాల డైరెక్టర్లు పీఎల్ఎన్.రెడ్డి, నరేందర్ రెడ్డి, హనుమంతరెడ్డిలు అభినందించారు.

పాఠశాలలకు వంట పాత్రలు పంపిణీ

మిర్యాలగూడ : ప్రభుత్వం సరఫరా చేసిన వంట పాత్రలను మిర్యాలగూడ మండలంలోని ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు శనివారం ఎంఈఓ లావూరి బాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాత వంట పాత్రల తో ఇబ్బందులు ఎదుర్కొంటున్న వంట సిబ్బందికి ఎంతో మేలు చేకూరుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు మంగళ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

వెంకటేష్‌కు నివాళి

చింతపల్లి : మండల పరిధిలోని నెల్వలపల్లి గ్రామానికి చెందిన గుర్రం వెంకటేశ్ శనివారం మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకొని దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్ వెంకటేశ్ మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు.అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారితో పాటు నల్లగొండ పార్లమెంటగ్ కో ఆర్డినేటర్ శిరాజ్‌ఖాన్, మండల పార్టీ అధ్యక్షుడు అంగిరేకుల నాగభూషణం, మాజీ సర్పంచ్ గుర్రం జగన్, బొంత వెంకటయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు గజ్జల వెంకట్ రెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షులు బార్ల నాగయ్య,వైయస్ కరుణాకర్, గార్లపాటి పెద్దులు గ్రామ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకులు దిష్టిబొమ్మ దహనం

వేములపల్లి : ప్రధానమంత్రి నరేంద్రమోదీ, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కాంగ్రెస్ నాయకులు అద్దంకి దయాకర్, అంజన్‌కుమార్‌ల దిష్టిబొమ్మలను శనివారం బీజేపీ నాయకులు మండల కేంద్రంలో దహనం చేవారు. ఈ కార్యక్రమంలో పెదమాం ప్రసాద్, సోమయ్య, రమేష్, మహేష్, నరేష్, రాంరెడ్డి, వెంకటేశ్వర్లు, అనిల్ కుమార్, సతీష్, పాల్గొన్నారు.

క్లుప్తంగా

పారిశుద్ధ్యం మెరుగునకు స్పెషల్ డ్రైవ్ : ఎమ్మెల్యే

మిర్యాలగూడ టౌన్ : పారిశుద్ధ్య వ్యవస్థను మెరుగుపరిచేందుకు ఆదివారం నుంచి స్పెషల్ డ్రైవ్‌ను నిర్వహించాలని మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి కోరారు. శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో మున్సిపల్ సిబ్బంది, వార్డు ఆఫీసర్లు, పారిశుద్ధ్య కార్మికులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ స్పెషల్ డ్రైవ్‌లో వార్డు ఆఫీసర్లు కూడా భాగస్వాములు కావాలన్నారు. అదే విధంగా వార్డు ఆఫీసర్లు కూడా తమ వార్డుల్లో పారిశుద్ధ్య కార్మికులతో స్పెషల్ డ్రైవ్‌ను చేయించాలన్నారు. పారిశుద్ధ్యంలో మిర్యాలగూడ మున్సిపాలిటీని ప్రథమ స్థానంలోకి తీసుకువచ్చేందుకు కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ మహ్మద్ యూసుఫ్, మున్సిపల్ డీఈఈ వెంకన్న, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటరమణ, టీపీఎస్ అంజయ్య పాల్గొన్నారు.

మెరుగైన వైద్యం అందించాలి : డీఎంహెచ్ఓ

నిడమనూరు : ఆస్పత్రికి వచ్చే రోగుల మెరుగైన వైద్యం అందించాలని డీఎంహెచ్ఓ జిల్లా వైద్యాధికారి పుట్ల శ్రీనివాస్ సూచించారు. నిడమనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఆస్పత్రి స్టోర్‌ను పరిశీలించి మందుల స్టాకును పరిశీలించారు. వైద్యసేవల కోసం వచ్చిన వారితో మాట్లాడారు. నిర్మాణంలో ఉన్న ఆస్పత్రి భవనాన్ని పరిశీలించారు. నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తిచేయాలని ఆదేశించారు. అనంతరం తుమ్మడంలో ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్ర భవనాన్ని పరిశీలించారు. ఆయన వెంట వైద్యులు డిప్యూటీ డీఎంహెచ్ఓ రవి, కేవీ అరవింద్, రఫీ, ఫార్మసిస్ట్‌లు, ల్యాబ్ టెక్నిషియన్లు తదితరులు ఉన్నారు.

టాలెంట్ టెస్ట్‌ల నిర్వహణ అభినందనీయం

మిర్యాలగూడ అర్బన్ : లక్పతి నాయక్ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో టాలెంట్ టెస్ట్‌లు నిర్వహించడం అభినందనీయమని ఎమ్మెల్సీ కేతావత్ శంకర్‌నాయక్ అన్నారు. శనివారం పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన టాలెంట్ టెస్ట్ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆలిండియా బంజారా సేవా సంఘం నాయకులు బాలాజీనాయక్, స్కైలాబ్ నాయక్, ఎంఈఓ బాలాజీ నాయక్, లావూరి వెంకన్న, రవినాయక్, ట్రస్ట్ చైర్మన్ గోపీనాథ్, అజయ్, విజయ్, కృష్ణకాంత్, హనుము తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి టాలెంట్ టెస్ట్‌లో విద్యార్థిని ప్రతిభ

గుర్రంపోడు : రాష్ట్రీయ ఆవిష్కార్ అభియాన్ 2024–25 కార్యక్రమంలో భాగంగా శనివారం డైట్ కళాశాల నల్లగొండ పట్టణంలో నిర్వహించిన టాలెంట్ టెస్ట్‌లో మండలంలోని పాల్వాయి జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని డి. త్రినైని మూడవ స్థానంలో ప్రతిభ కనపర్చింది. ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖాధికారి బిక్షపతి, జిల్లా సెక్టోరియల్ అధికారి రామచందర్ నాయక్, జిల్లా సైన్స్ అధికారి వనం లక్ష్మీపతి ప్రశంసపత్రం, మెమెంటో అందించారు. పాఠశాల విద్యార్థిని ప్రతిభపై హెచ్ఎం ఎం. విజయలక్ష్మి, గైడ్ టీచర్ మహ్మద్ ఇబ్రహీంలు, టీచర్లు అభినందించారు.

విద్యుదాఘాతంతో గడ్డి కట్టలు దగ్ధం

పెద్దఅడిశర్లపల్లి : ట్రాక్టర్‌లో గడ్డి కట్టలు వేసుకొని వెళ్తుండగా విద్యుత్ తీగలకు తగిలి గడ్డి కట్టలు దగ్ధమైన సంఘటన పెద్దఅడిశర్లపల్లి మండలంలో శనివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం అజ్మాపురం గ్రామానికి చెందిన రైతు దుగ్యాలలో ఓ రైతు వద్ద గడ్డి కొనుగోలు చేసి ట్రాక్టర్‌లో లోడ్ చేసుకుని వెళ్తుండగా గ్రామ సమీపంలోకి రాగానే విద్యుత్ తీగలకు తాకి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దీంతో అప్రమత్తమైన ట్రాక్టర్ డ్రైవర్ ట్రాక్టర్‌లోని గడ్డికట్టలు అన్‌లోడ్ చేయడంతో ప్రమాదం తప్పింది. గడ్డి కట్టలు విద్యుత్ తీగలకు తాకడంతో విద్యుత్ స్తంభం విరిగింది.

స్నేహితుడి కుటుంబానికి చేయూత

గుర్రంపోడు : రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన మండలంలోని కొప్పోలు గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ బల్గూరి శేఖర్ గౌడ్ కుటుంబానికి 1999–2000 పదోతరగతి బ్యాచ్ విద్యార్థులు అండగా నిలిచారు. శనివారం జరిగిన పెద్ద కర్మలో స్నేహితులంతా కలిసి తమవంతు సాయంగా రూ.35,300లను మృతుడి కుటుంబానికి అందించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు సింగం ప్రవీణ్, విజయ్, ఎండీ జానీమియా, హరిబాబు, విష్ణువర్ధన్, నగేష్, చామయ్య, కృష్ణగౌడ్, కల్పన పాల్గొన్నారు.

ఐఎన్‌టీయూసీ సదస్సును విజయవంతం చేయండి

త్రిపురారం : మండల కేంద్రంలోని అనుముల సుశీల నర్సింహ రెడ్డి ఫంక్షన్ హాల్‌లో ఆదివారం నిర్వహించే నియోజక వర్గ స్థాయి ఐఎన్‌టీయూసీ సదస్సును జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు అంబటి సోమయ్య పిలుపునిచ్చారు. శనివారం మండలంలోని ప్రొఫెసర్ జయశంకర్ వరి పరిశోధన స్థానంలోని కార్మికులతో సమావేశం నిర్వహించారు. సదస్సు కరపత్రం ఆవిష్కరించారు.